వేతనాలు ఇంకెప్పుడు



ఉక్కు ఉద్యోగుల ఎదురుచూపులు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 19వ తేదీ వచ్చినా ఈ నెల వేతనాలు ఇంకా అందలేదు. గతంలో 50 శాతం, 35 శాతం అంటూ రెండు విడతలుగా ఇచ్చినా, మొదట విడత 10వ తేదీలోగా చెల్లించేవారు. ఈసారి ఇంతవరకు ఒక విడత కూడా ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 19వ తేదీ వచ్చినా అందని జీతాలు
- సకాలంలో లోన్లు చెల్లించలేక డిఫాల్టర్లుగా మారుతున్న వైనం
- కుటుంబాలు గడిచేదెలా అంటూ ఆవేదన

ఉక్కునగరం: సమయానికి వేతనాలు అందక ఉక్కు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్ నెల జీతం 50 మాత్రమే శాతం చెల్లించగా, అక్టోబర్ జీతం 65 శాతం చెల్లించారు. ఇక నవంబర్ నెలకు సంబంధించి ఇంతవరకు ఒక రూపాయి కూడా చెల్లించలేదు. వెరసి మూడు నెలలకు సంబంధించి మొత్తం 185 శాతం జీతం ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. గత మూడు నెలలుగా ఉద్యోగుల జీతాలు, పీఎఫ్‌లకు సంబంధించి సుమారు రూ. 1063 కోట్లు యాజమాన్యం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని కార్మిక నాయకులు చెబుతున్నారు. గతంలో రెండు వాయిదాలు ఇచ్చినప్పుడే మెజార్టీ ఉద్యోగులు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలకు డిఫాల్టర్లుగా మారారు. గత మూడు నెలలుగా జరుగుతున్న పరిస్థితుల వల్ల ఉద్యోగుల ఇబ్బందులు చెప్పనలవి కాదు.

ఇదీ ప్లాంట్ పరిస్థితి..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ, స్థానిక యాజమాన్యాల నిర్లిప్తతతో ప్లాంట్ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. తద్వారా స్టీల్‌ప్లాంట్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడింది. ముడిపదార్థాల కొరత వల్ల కొంతకాలం ఒక బ్లాస్ట్‌ఫర్నేస్ మాత్రమే నడపాల్సిన పరిస్థితి వచ్చింది. గత సీఎండీ అతుల్ భట్ హయాంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 50 శాతం చొప్పున రెండు వాయిదాల్లో చెల్లించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన తర్వాత ఉద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. అయితే, ఆ తర్వాత పరిస్థితులు మరింత క్షీణించి ఒకానొక దశలో ఒక రోజు, రెండు రోజులకు మాత్రమే ముడి పదార్థాలు ఉన్నాయనే దశకు చేరుకుంది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ. 1650 కోట్లు ఆర్థిక సాయం అందటంతో ముడి పదార్థాల కొనుగోలు ప్రారంభమైంది. దీంతో రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ పునః ప్రారంభానికి మార్గం సుగమమైంది. రెండు ఫర్నేస్‌లలో జరిగే ఉత్పత్తి వలన వచ్చే అమ్మకాలను ముడి పదార్థాల కొనుగోలుకు వినియోగిస్తున్నారు. కానీ ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దురదృష్టకరం.

రుణాలూ పొందలేక..

యాజమాన్యం ఉద్యోగులకు చెందిన పీఎఫ్ ట్రస్ట్, ఎస్ఏబీఎఫ్ ట్రస్టులకు రూ.900 కోట్లు చెల్లింపులు నిలిపివేసింది. దీంతో పీఎఫ్ నాన్ రిటర్నబుల్ లోన్, పదవీ విరమణ ముందు ఇచ్చే 90 శాతం పీఎఫ్‌ను కూడా ఉద్యోగులు వినియోగించుకోలేక పోతున్నారు. అదేవిధంగా ఉద్యోగుల రుణాలకు అండగా ఉండే థ్రిఫ్ట్ సొసైటీకి ఉద్యోగుల రికవరీ అమౌంట్ సుమారు రూ. 80 కోట్లు చెల్లించలేదు. దీంతో థ్రిఫ్ట్ సొసైటీ రుణాలను నిలిపివేసింది. ఉద్యోగులు సర్వీసులో ఉండగా మరణిస్తే ఇచ్చే ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్‌ను కూడా ఆయా కుటుంబాలకు ఇవ్వకపోవడంతో ఆయా కుటుంబాలు ఆకలితో అల్లాడుతున్నాయి.

పండగకైనా జీతం అందేనా?

ఈ నెలలో క్రిస్మస్ పండగ, వచ్చే నెలలో సంక్రాంతి పండగలు ఉన్నాయి. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న 185 శాతంలో ఒక నెల జీతం లేదా 85 శాతం అయినా ఇచ్చి ఉంటే తమ సమస్యలు కొంతమేర పరిష్కారం అవుతాయని ఉద్యోగులు భావిస్తున్నారు.

జనవరి వరకు అవస్థలేనా?

రెండు రోజుల క్రితం పోరాట కమిటీ నాయకులు న్యూఢిల్లీ వెళ్లి ఉక్కు మంత్రి కుమారస్వామికి సమస్యలను ఏకరువు పెట్టారు. జనవరిలో సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి చెప్పారు. మంత్రి ఇచ్చిన సమాధానం మేరకు ఇప్పటి వరకు జీతాల చెల్లింపు అంశంపై జరుగుతున్న జాప్యం ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జరుగుతోందని అర్థం అవుతోంది. వారి ఆదేశాల మేరకు మాత్రమే స్థానిక యాజమాన్యం జీతాలు చెల్లిస్తోందని తెలుస్తోంది. మంత్రి ఇచ్చిన హామీ గతం వలే అమలు అవుతుందా, మరి ఈనెల జీతం సంగతేంటి అనే సందేహాలు ఉద్యోగుల్లో వ్యక్తం అవుతున్నాయి.



జీతాలు చెల్లించాలంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన ఉద్యోగుల కుటుంబాలు (ఫైల్)

జీతాలు లేని ప్యాకేజీలతో లాభం ఏంటి?



ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా ఆకలితో ఉంచుతూ ఇచ్చే ప్యాకేజీల వల్ల లాభం ఏంటి? ప్రస్తుతం జరుగుతున్న ఉత్పత్తి కోసం శ్రమిస్తున్న ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం యాజమాన్యం ఉద్దేశంగా ఉంది. ఉద్యోగులకు జీతాలు చెల్లించేలా మంత్రిత్వశాఖపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలి. – యు. రామస్వామి, స్టీల్ సీఐటీయు ప్రధాన కార్యదర్శి

కావాలనే జాప్యం చేస్తున్నారు



ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడానికి యాజమాన్యం, ప్రభుత్వం కావాలనే జీతాలను జాప్యం చేస్తున్నారు. ప్రతీ రోజు రూ.50 నుంచి 60 కోట్లు అమ్మకాలు చేసి డిపాజిట్లు చేస్తున్నారు. కానీ ఉత్పత్తికి కారణమైన ఉద్యోగులకు జీతాలు చెల్లించటం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇచ్చేవరకు పూర్తి జీతాలు ఇవ్వమని చెప్పడం దుర్మార్గం.

– నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు

విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఈఈ బీకే నాయుడు

అక్కిరెడ్డిపాలెం : విద్యుత్ పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు అన్నారు. గాజువాక శ్రీనగర్‌లోని టీఎస్ఆర్, టీబీకే కళాశాలలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. పీఎం సూర్య ఘర్ (సోలార్ రూఫ్ టాప్), విద్యుత్ సమస్యలు, ఏపీఈపీడీసీఎల్ ఏపీపీ ద్వారా డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కె.రామకృష్ణ, ఆటోనగర్ ఏఈ చంద్రశేఖర్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగనంపూడి : వచ్చేనెల నుంచి ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించనున్న క్రమంలో వ్యాపారులు పూర్తిగా వినియోగించడం, విక్రయించడం మానుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని 86వ వార్డు సచివాలయ కార్యదర్శి జి.రాజు, కె.దేముడు హెచ్చరించారు. కూర్మన్నపాలెం ముస్తఫా కూడలిలో ప్లాస్టిక్ సంచుల వినియోగం, నిషేధంపై గురువారం అవగాహన కల్పించారు. తోపుడు బళ్లు, కాయగూరల దుకాణాలు, కిరాణా దుకాణాల వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు లక్ష్మీకాంతమ్, సహజ, లోకేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక సరఫరా కేంద్రం ప్రారంభం



ఇసుక సరఫరా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: మింది గుడివాడ అప్పన్న కాలనీ వద్ద ఆటోనగర్ ఏ బ్లాక్‌లోని గ్లోబెక్స్ వెనుక ఇసుక సరఫరా కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక సరఫరా కేంద్రంలో టన్ను ఇసుకకు ప్రభుత్వం రూ.1000 ధర నిర్ణయించిందని చెప్పారు. బ్లాక్ మార్కెట్ ఉండదని, అధికధరలకు విక్రయాలు జరిపితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇసుక కొనుగోలుకు పరిమితి ఏమీ లేదని, ఆన్‌లైన్‌లో గానీ లేదా నేరుగా గానీ కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, సీఐ ఎ.పార్థసారథి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



10వ తరగతి విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ గురువారం సందర్శించారు. పాఠశాలలో 10వ తరగతి ప్రత్యేక తరగతి గదులను పరిశీలించారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారో విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, దేముళ్లు, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ



దాతలు అందించిన చీరలు, దుప్పట్లతో మహిళలు

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిరుపేదలకు చీరలు, దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. దాతలు వి.మాలతీదేవి, రవీంద్ర కుమార్, అనిత సహకారంతో పేద వృద్ధులు, మహిళలకు వీటిని అందించారు. ముందుగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం హారతి, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కె.వి.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ, పి.రామారావు, పీఎల్ఎన్.రాజు, సత్యలక్ష్మి, ఆర్.సత్యశ్రీదేవి, పంకజ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవొద్దు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో గురువారం డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విలువైన మానవ వనరులుగా యువతరం నిలుస్తూ దేశ అభ్యున్నతిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్

అగనంపూడి : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కు కార్యదర్శి సంజయ్ రాయ్‌ను వినతిపత్రాల్లో కోరామని పరిరక్షణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెంలోని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ రిలే దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. వేతన బకాయిలు చెల్లించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధిస్తూ కొంతకాలంగా యాజమాన్యం విధిస్తున్న ఆంక్షలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కర్మాగారానికి ప్రభుత్వం మూడేళ్లపాటు టాక్స్ హాలీడే ప్రకటించాలని, స్టీల్ ప్లాంట్ భూములను ఆర్ఐఎన్ పేరున బదిలీ చేయాలని, యాజమాన్యం, కేంద్రం విధించిన ఆంక్షల వల్ల ఉక్కు కర్మాగారానికి జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణరావు, కామేశ్వరరావు, డేవిడ్, కారు రమణ, మసేనురావు, రామకృష్ణ, సుబ్బయ్య, దేముడు పాల్గొన్నారు.

విశాఖలోనే ఈఎస్ఐ వైద్య కళాశాల నిర్మించాలి

- అమరావతిలో ఏర్పాటు చేస్తామంటే ఊరుకునేది లేదు
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



షీలానగర్‌లో ఆస్పత్రి నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం: విశాఖలో నిర్మిస్తున్న ఈఎస్ఐ హాస్పిటల్‌కు అనుబంధంగానే వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. షీలానగర్‌లో చేపట్టిన 500 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని సిటు జిల్లా కార్యదర్శి కుమార్, గాజువాక నాయకులు ఎం.రాంబాబు, ఎస్.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణలతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఈఎస్ఐ మెడికల్ కాలేజీని అమరావతిలో పెడుతున్నట్లు ప్రకటించారని, విశాఖలోనే దాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో ఈఎస్ఐ కార్డుదారులు 5 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎక్కడైనా హాస్పిటల్‌కు అనుబంధంగానే మెడికల్ కాలేజీలు ఉంటాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విశాఖ పారిశ్రామిక కేంద్రం అని, తరచూ కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఇక్కడే ఆస్పత్రితోపాటు, మెడికల్ కాలేజీ ఉంటే మేలన్నారు. విశాఖలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనేక విధాలుగా పోరాటాలు చేసి సాధించుకున్నామని, ఇప్పుడు దానికి అనుబంధంగా ఏర్పాటు చేయాల్సిన మెడికల్ కాలేజీని అమరావతికి తీసుకుపోతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఆర్టీఐ లేఖ తీసుకోవడానికి నిరాకరణ

అగనంపూడి : సమాచార హక్కు చట్టం ద్వారా పంపిన లేఖను డిప్యూటీ సీఎం కార్యాలయం తీసుకోవడానికి నిరాకరిస్తూ తిరిగి వెనక్కి పంపించడం ఆర్టీఐని అవమానపర్చడమే అవుతుందని స.హ.చ కార్యకర్త పట్టా రామ అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు కర్మాగారంలో మృతి చెందిన ఒక అధికారి మరణంపై సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రికి ఆర్టీఐ ద్వారా ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై ఏ చర్యలు తీసుకున్నారో వివరాలు కావాలని కోరితే కనీసం డిప్యూటీ సీఎం కార్యాలయం లేఖను తీసుకోవడానికి నిరాకరిస్తూ తిరిగి వెనక్కు పంపించడం భారత రాజ్యాంగాన్ని కించపర్చడమే అవుతుందన్నారు. అవినీతిని ప్రశ్నిస్తా అని గొంతెత్తిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం ఇలా వ్యవహరిస్తుంటే రాష్ట్ర ప్రజలకు ఎటువంటి సందేశం ఇస్తున్నారో ఆలోచించుకోవాలని కోరారు.

అరకు కాఫీని ప్రమోట్ చేయాలి

- మాజీ క్రికెటర్ వేణుగోపాలరావును కోరిన జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్



జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌తో భేటీ అయిన మాజీ క్రికెటర్ వేణుగోపాలరావు

మహారాణిపేట: భారత మాజీ క్రికెటర్, ఢిల్లీ క్యాపిటల్ డైరెక్టర్ వేణుగోపాలరావు గురువారం జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జీసీసీ బలోపేతనికి సలహాలు ఇవ్వాలని, అరకు కాఫీని ప్రమోట్ చేయాలని, క్రికెట్ స్టేడియంలో అరకు కాఫీని పొందుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని వేణుగోపాలరావును కోరారు.

హడలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులుగా సంచరిస్తూ దాడి
- పీహెచ్‌సీలకు బాధితుల పరుగు



నడుపూరు వీధుల్లో రోడ్డుపై గుంపుగా కుక్కలు



పెదగంట్యాడలో రోడ్డుపై కుక్కల గుంపు



పిట్టవానిపాలెంలో గుంపుగా కుక్కలు

పెదగంట్యాడ : కుక్కలు కరిచేస్తున్నాయ్.. వెంటపడి మరీ పిక్కలు పట్టుకుంటున్నాయి.. వాహనాలపై వెళ్తే రోడ్డుకు అడ్డంగా వచ్చి మీద పడుతున్నాయ్.. రోడ్డు మీద నడిచి వెళ్లే చిన్నారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయ్.. ఇటీవల కాలంలో మండలంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మండలంలోని నడుపూరు, సిద్దేశ్వరం, దయాల్‌నగర్, నెల్లిముక్కు, పిట్టవానిపాలెం, నమ్మిదొడ్డి, మదీనాబాద్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది. అలాగే కుక్క కాటు కేసులు కూడా ఎక్కువవుతున్నాయ్. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నెలకు 50 నుంచి 60 వంతున కేసులు నమోదవుతున్నాయి. సిద్దేశ్వరం యూపీహెచ్‌సీ పరిధిలో నెలకు 28 నుంచి 30 కేసులు నమోదవుతుండగా, గంగవరంలో నెలకు 10 నుంచి 12, దేవాడ పీహెచ్‌సీ పరిధిలో 20 వరకూ, నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ పరిధిలో 25 వరకూ కేసులు నమోదవుతున్నాయ్. రోజూ ఎక్కడో ఓ చోట కుక్క కరిచిందంటూ బాధితులు పీహెచ్‌లకు పరుగులు తీస్తున్నారు. రోజు రోజుకూ బాధితులు పెరుగుతున్నారు. అయితే అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో అందుబాటులో వ్యాక్సిన్ ఉండడంతో బాధితులకు వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నారు. కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుక్కల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా రేపు



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జవహర్ నాలెడ్జ్ సెంటర్, సూర్య ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో గురువారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. టాటా గ్రూప్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, అరబిందో ఫార్మా, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం, ఎస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో, తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలు తీసుకుని శనివారం ఉదయం 9.30 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

తెరిపివ్వని వాన



వర్షంలో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, పాదచారులు



గాంధీనగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

పెదగంట్యాడ: వర్షం వణికించింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మండలంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. నడుపూరు, గోపాల్‌రెడ్డినగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రనగర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, రిక్షా కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతు బజార్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో అటు రైతులు, ఇటు కొనుగోలుదారులకు అవస్థలు తప్పలేదు. అసలే చలి, దానికి తోడు వర్షంతో ఇళ్లకే పరిమితమయ్యారు.



చిత్తడిగా మారిన పెదగంట్యాడ రైతుబజార్ ఆవరణ